# యూనిట్ II

# 5. నీవేమైనా చేయగలవు

– బోయి భీమన్న

**చదవండి–ఆలోచించండి–మాట్లాడండి**

నేను సైతం ప్రపంచాగ్నికి
సమిధనొక్కటి ఆహుతిచ్చాను!
నేను సైతం విశ్వవృష్టికి
అశ్రువొక్కటి ధారపోశాను!
నేను సైతం భువనఘోషకు
వెర్రిగొంతుక విచ్చి మ్రోశాను!
..............................
..............................
..............................

నేను సైతం ప్రపంచాబ్జపు
తెల్లరేకై పల్లవిస్తాను
నేను సైతం విశ్వవీణకు
తంత్రినై మూర్ఛనలు పోతాను.
నేను సైతం
భువన భవనపు
బావుటానై పైకి లేస్తాను.

– శ్రీశ్రీ

**ప్రశ్నలు:**

1. పై కవిత చదవడంవల్ల నీకేమి అర్థమయింది?
2. కవి చెప్పదలచుకున్నది ఏమిటి?
3. కవి భావనతో మీరు ఏకీభవిస్తున్నారా? ఎందుకు?

**ఉద్దేశం:** అన్నింటికీ మనసే మూలమని, మంచి మనసుతో ఎవర్నైనా జయించవచ్చని తెలుపుతూ, ఆత్మ విశ్వాసాన్ని కలిగించడమే ప్రస్తుత పాఠ్యభాగం "పాటలతోట" అనే గ్రంథం లోనిది.

**విద్యార్థులకు సూచనలు:**
1. పాఠాన్ని చదవండి. అర్థంకాని పదాల కింద, వాక్యాల కింద గీతలు గీయండి.
2. అర్థంకాని పదాలను, వాక్యాలను గుర్తించి మీ మిత్రులతో చర్చించండి.
3. పాఠ్యపుస్తకం చివరన ఉన్న 'అర్థాల పట్టిక' చూసి తెలియని పదాల అర్థాలను తెలుసుకోండి.





నీ మనసే నీదైవం
నీ ప్రజ్ఞే నీ ప్రగతి
నీవే నీ జాతి నిర్మాతవు
నీవే నీ సుఖశాంతుల కర్తవు.



ఫల వృక్షం పెంచేవా
ఫలము లారగించేవు
ముళ్ళ మొక్క నాటేవా
ముళ్ళు గిచ్చి వగచేవు



నీకు నీవే దాసోహం
నీకు నీవె అభయంకరం
నీ పరిశ్రమే నీ సౌభాగ్యం
నీవే నీకు సమస్తం.



పద్మం వికసించే కొలది
పరిమళం వ్యాపించు
వేగం పెరిగే కొలది
విశ్వం వ్యాకోచించు



మనసును గెల్చినవాడవు
మనోవేగ మొక లెక్కా
కోటి కాంతి వర్షాలను
గుప్పిట గొనిరాగలవు



ఏ గ్రహతారాసీమల
ఏ సేద్యం చేసేవో
ఏ లోకాంతరవాసుల
తో స్నేహం నెరిపేవో



©SCERT not to be republished



మనోవేగమేనోయ్ ఈ
మహామహస్సు
మంచి మనసె పురుషోత్తమ
మహదోజస్సు

జ్ఞానివి నీవు నీ
వేమైనా చేయగలవు.



**కవిపరిచయం:**



1. కవిపేరు : బోయి భీమన్న
2. జన్మస్థలం : తూర్పుగోదావరి జిల్లా మామిడి కుదురు గ్రామం
3. జననం–మరణం : 1911–2005
4. తల్లిదండ్రులు : నాగమ్మ, పల్లయ్యలు
5. రచనలు : పాలేరు, కూలిరాజు, అనసూయ, జానపదుని జాబులు, దీపసభ మధుబాల, రాఖీలు, ధర్మంకోసం పోరాటం, రాగవాసిష్ఠం, మానవుని మరో మజిలీ, పైరుపాట, చిత్రకళాప్రదర్శనం, మధుగీత, రాగోదయం అనార్కలి, పిల్లిశతకం మొదలైనవి. వీరి "గుడిసెలు కాలిపోతున్నాయి" అనే గ్రంథానికి కేంద్ర సాహిత్య అకాడమీ వారి బహుమతి వచ్చింది.
6. బిరుదులు : పద్మశ్రీ, మహాకవి.
   ఆంధ్రవిశ్వవిద్యాలయంవారి కళాప్రపూర్ణ బిరుదు పొందారు.
   కాశీవిద్యాపీఠంవారు గౌరవ డాక్టరేటు పట్టానిచ్చి గౌరవించారు.



**సారాంశం**

1. దేవుడు మరెక్కడో లేదు. నీ మనసులోనే ఉంటాడు. నీ తెలివి తేటలే నీ అభివృద్ధికి మార్గాలవుతాయి. నీ జాతిని నీవే నిర్మించుకుంటావు. నీవు పొందే కష్టాలకైనా, సుఖాలకైనా నీవే కారణం.
2. పండ్ల చెట్లను పెంచితే పండ్లను తినగలవు కానీ ముళ్ళ చెట్లను పెంచితే అవి గుచ్చుకుని బాధపడటం కంటే మరే లాభం ఉండదు.
3. నువ్వు ఎవరికీ లొంగి ఉండాల్సిన అవసరం లేదు. నీకు నువ్వే యజమానివి. దాసుడివి. నీకు నువ్వే ధైర్యాన్ని కలిగించుకోవాలి. నీ కష్టంవల్ల మాత్రమే నీకు సంపదలు కలుగుతాయి. నీ జీవితంలో జరిగే సమస్త విషయాలకు నీవే బాధ్యత వహించాలి.
4. పద్మం వికసించినపుడే దాని పరిమళం వ్యాపిస్తుంది. ఆ పరిమళాలు వ్యాపించే వేగం ఎంత పెరిగితే అంత వేగంగా అవి విశ్వవ్యాప్తమవుతాయి.
5. ఇతర గ్రహాలమీద కూడా నివసించాలనీ, అక్కడ కూడా పంటలు పండించాలనీ, గ్రహాంతర వాసులతో స్నేహం చేయాలని ఆశపడుతున్నావు.
6. నువ్వు మనసునే జయించావు. ఇక నీకు దాని వేగం ఒక లెక్కకాదు. కోట్ల కాంతిసంవత్సరాల దూరంలో ఉన్న దాన్ని కూడా నీ గుప్పిట్లో తీసుకుని రాగలవు.
7. ఇలాంటి మనోవేగం కలిగిన మంచి మనసుగల వారే పురుషోత్తములనిపించుకుంటారు.

అలాంటి జ్ఞానివి నీవే. నీవు ఏమైనా చేయగలవు.


## ఇవి చేయండి

### I. వినడం–మాట్లాడడం



1. ఈ గేయం దేన్ని గురించి చెబుతున్నది?
2. పాఠ్యభాగ సారాంశాన్ని సొంతమాటల్లో చెప్పండి.
3. "నీవేమైనా చేయగలవు" అనే గేయాన్ని చదివిన తర్వాత నీకెలా అనిపించింది?
4. ఈ గేయం విన్నారు కదా! కవి బోయి భీమన్న గారి గురించి మీరేమి అర్థం చేసుకొన్నారు?

### II. చదవడం, అవగాహన చేసుకోవడం



1. ఈ కింది పదాలు చదవండి. పాఠంలో ఆ పదాలతో వచ్చే వాక్యాలు ఎక్కడున్నాయో గుర్తించండి.

అ) ప్రగతి ఆ) నిర్మాతవు ఇ) సుఖశాంతులు ఈ) ఫలములు
ఉ) ముళ్ల మొక్క ఊ) దాసోహం ఋ) సమస్తం ౠ) వ్యాకోచించు

2. కింది పేరా చదవండి. మూడు ప్రశ్నలు రాయండి.

బోయి భీమన్న ప్రముఖ తెలుగుకవి. ఈయన రచనలు సరళంగా ఉంటాయి. కొంతకాలం వీరు ఆంధ్రప్రదేశ్ విధానమండలి సభ్యులుగా పనిచేశారు. సాంఘిక న్యాయం కోసం పోరాటంచేశారు. అంబేద్కర్ సిద్ధాంతాలకు అనుగుణంగా పోరాడారు.


అ) ప్ర. ______________________ ?

ఆ) ప్ర. ______________________ ?

ఇ) ప్ర. ______________________ ?

3. కింది వాక్యాలు తారుమారైనాయి. పాఠం చదివి సరిచేయండి.

ముళ్ళ మొక్క నాటేవా
ఫలములారగించేవు
ఫలవృక్షం పెంచేవా
ముళ్లు గిచ్చి వగచేవు
......................
......................
......................



4. కింది ప్రశ్నలకు పాఠం ఆధారంగా సమాధానాలు రాయండి.

అ) ఎందుకు ఫలవృక్షాలను పెంచాలి?

ఆ) ముళ్ళమొక్కలను ఎందుకు పెంచగూడదు?

ఇ) వేగం పెరిగే కొద్దీ ఏమౌతుంది?

ఈ) ఎక్కడ సేద్యం చేశావని కవి అంటున్నాడు.

## III. స్వీయరచన



కింది వాటికి సమాధానాలు రాయండి.

అ) పాఠ్యభాగ సారాంశాన్ని సొంతమాటల్లో రాయండి.

ఆ) "జ్ఞానివి నీవు నీవేమైనా చేయగలవు" అని కవి ఎందుకన్నారు?

ఇ) లోకాంతరవాసులు నిన్ను కలిస్తే మీరు వారితో ఏం మాట్లాడుతారు?

ఈ) "నీ పరిశ్రమే నీ సౌభాగ్యం" అనే వాక్యం ద్వారా మీరు గ్రహించిందేమిటి?

ఉ) "నీ సుఖశాంతులకు నీవే కర్తవు" దీనిపై మీ అభిప్రాయం తెల్పండి.



## IV. పదజాలం



1. కింది వాక్యాలలో గీతగీసిన పదాలకు సమానమయిన అర్థాలతో ఉన్న పదాలను పాఠం ఆధారంగా రాయండి.

అ) భారతదేశం ప్రగతి పథంలో పయనిస్తూ ఉంది ____________

ఆ) మా పెరటిలో పెద్ద మామిడి వృక్షం ఉంది ____________

ఇ) పుష్పాలు సౌరభాలు వెదజల్లుతాయి ____________

2. కింద ఉన్న ప్రకృతి – వికృతి పదాలను జత చేయండి. తిరిగి సరిగా ప్రకృతి – వికృతులను పట్టిక రూపంలో రాయండి.

1) నెయ్యం — అ) పగ్గె ( )
2) దయ్యం — ఆ) ఆకసం ( )
3) ప్రజ్ఞ — ఇ) స్నేహం ( )
4) ఆకాశం — ఈ) దైవం ( )

3. కింది పద్యం చదవండి. నీకు నచ్చిన పదాలను పట్టికలో రాసి, వాటితో వాక్యాలు రాయండి.

అమ్మ ప్రేమ నిచ్చు అమృతంపు భాషరా
తండ్రిమనసు వంటి ధన్యభాష
గురువు దీవనవలె గురియైన భాషరా
దేవగణము మెచ్చు తెలుగుభాష



| పదం | వాక్యం |
|---|---|
| అమ్మ | అమ్మ మొదటి గురువు |
| తండ్రి | |
| గురువు | |
| తెలుగుభాష | |

## V. సృజనాత్మకత



గేయాన్ని ఆధారం చేసుకుని సూక్తులను, నినాదాలను తయారుచేయండి. వాటిని ప్రదర్శించండి. లేదా ఒక్కొక్కరు బడితోట గురించి ఒక మొక్క నాటమని తెలియజేయడానికి పోస్టరు తయారుచేయండి.



## VI. ప్రశంస



"నీవేమైనా చేయగలవు" పాఠంలో మీ తెలివితేటలే మన అభివృద్ధికి మార్గమని తెలుసుకొన్నారు కదా! మీ తెలివితేటలతో మీరు ఏమేం చేయాలనుకుంటున్నారో రాయండి.

## VII. భాషాంశాలు



సీత బడికి వెళ్ళింది.

సీత అన్నం తిని, బడికి వెళ్ళింది.

సీత అన్నం తిన్నది, కాని బడికి వెళ్ళలేదు.

ఇలా ఉన్న వాక్య భేదాల గురించి మీరు తెలుసుకున్నారు. అవేమిటంటే సామాన్య, సంశ్లిష్ట సంయుక్తవాక్యాలు. ఐతే ఈ వాక్యాలు ఇలా వేరువేరుగా కనబడటానికి కారణం ఆ వాక్యాల్లోని క్రియ. అంతే కదా! క్రియనుబట్టే కాక అర్థాన్నిబట్టి వాక్యాల్లో తేడాలు గమనించవచ్చు. అలాంటి వాక్యభేదాలు చాలా ఉన్నాయి. వాటిలో కొన్నింటిని తెలుసుకుందాం!

1. కింది వాక్యాల్ని చదివి అర్థంచేసుకోండి.

అ) ఆహా! ఎంత బాగుందో!

ఆ) చేతులు కడుక్కో!

ఇ) చాలాసేపు టీ.వీ. చూడవద్దు.

ఈ) లోపలికి రావచ్చు.

ఈ) గోపాల్ చెట్టు ఎక్కగలడు.

చదివారు కదా! పై వాక్యాలు ఒక్కో భావాన్ని సూచిస్తున్నాయి. అదెలాగో చూద్దాం!

'ఆహా! ఎంత బాగుందో!' ఇది ఆశ్చర్యానికి సంబంధించిన అర్థాన్ని సూచిస్తుంది. కనుక ఈ వాక్యం ఆశ్చర్యార్థక వాక్యం.

ఇక రెండో వాక్యం. 'చేతులు కడుక్కో' ఇది విధిగా చేయాలి అనే అర్థాన్ని సూచిస్తున్నది. చేయాల్సిన పనిని విధిగా చెయ్యాలి అనే అర్థాన్ని సూచించే వాక్యాన్ని విధ్యర్థక వాక్యం అంటాం.

ఇక మరో వాక్యం చూడండి.

'చాలా సేపు టీ.వీ. చూడొద్దు.'

ఈ వాక్యం టీ.వీ. చూడటం వద్దని చెబుతున్నది. టీ.వీ. చూడటాన్ని నిషేధిస్తున్నది కదా! అంటే నిషేధార్థక వాక్యం.

ఒక పనిని చేయవద్దని నిషేధించే అర్థాన్ని సూచించే వాక్యం నిషేధార్థక వాక్యం.

ఇక నాలుగో వాక్యం 'లోపలికి రావచ్చు'.



ఈ వాక్యం ఒక వ్యక్తికి అనుమతిని ఇస్తున్నట్లు సూచిస్తున్నదికదూ! అంటే అది అనుమత్యర్థక వాక్యం.

ఏదైనా ఒక పనిని చేయడానికి అనుమతినిచ్చే అర్థాన్ని సూచించే వాక్యం అనుమత్యర్థక వాక్యం.

ఇక చివరి వాక్యం "గోపాల్ చెట్టు ఎక్కగలడు".

ఈ వాక్యంలో గోపాలు చెట్టు ఎక్కగలడు. అంటే గోపాల్‌కున్న చెట్టును ఎక్కే సామర్థ్యాన్ని సూచిస్తున్నది.

ఇది సామర్థ్యార్థక వాక్యం.

ఒక వ్యక్తికి గాని, వ్యవస్థకుగాని లేదా యంత్రానికిగాని ఉన్న సమర్థతను సూచించే అర్థం గల వాక్యాన్ని సామర్థ్యార్థక వాక్యం అంటాం.

2. కింది వాక్యాలు వాటిలోని భావాన్ని అనుసరించి ఏ వాక్యాలు అవుతాయో గుర్తించి రాయండి.



అ) సీత కలెక్టరైందా? ____________________

ఆ) మీరు తర్వాత కొట్టుకోవచ్చు. ____________________

ఇ) అక్క చెప్పేది విను. ____________________

ఈ) రసాభాస చేయకండి. ____________________

ఉ) సబిహ లెక్కలు బాగా చేసింది. ____________________

ఊ) నీవు ఇంటికి వెళ్ళవచ్చు. ____________________

ఇలాంటి మరిన్ని వాక్యాలు మీ పాఠ్యాంశాల్లో నుంచి రాయండి.

### ప్రాజెక్టు పని

**పరిమళాలను ఇచ్చే పూలను సేకరించండి, వాటితో అందంగా బొకే తయారుచేయండి. ప్రదర్శించండి.**



### నేనివి చేయగలనా..?



| | | |
|---|---|---|
| 1. | గేయాన్ని చదవగలను. భావాన్ని సొంతమాటల్లో చెప్పగలను. | ఔను / కాదు |
| 2. | గేయాలలోని పదాలను సొంతవాక్యాలలో రాయగలను. | ఔను / కాదు |
| 3. | గేయాన్ని సొంత మాటల్లో రాయగలను. | ఔను / కాదు |
| 4. | గేయం ఆధారంగా సూక్తులు, నినాదాలు రాయగలను. | ఔను / కాదు |

*"ఇతరుల కోసం నిరీక్షించడం అలవాటైతే నువ్వు వెనకబడిపోతావు."*



©SCERT not to be republished